సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



అర్జీలు త్వరగా పరిష్కరించాలి

ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు.

- 8లో



దళారులను నమ్మొద్దు

కురుపాం: అటవీ ఉత్పత్తులను దళారులకు విక్రయించి మోసపోవద్దని జీసీసీ గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ ఇన్‌చార్జ్ ఎం.సాంబశివరావు గిరిజనులకు సూచించారు. మరిపిల్లి గిరిజనులకు జీసీసీ కల్పిస్తున్న మద్దతు ధరలను వివరించారు.

పాతదుగ్గిలో ఒంటరి ఏనుగు



కొమరాడ: ఒంటరి ఏనుగు పాతదుగ్గిలో సంచరిస్తోందని, కళ్లికోట, దుగ్గి, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. సోమవారం రాత్రికి గుణానపురం నరిసరాల్లోకి చేరుకునే అవకాశం ఉందని, ఆరుబయట పశువులు కట్టరాదన్నారు.

న్యూస్‌రీల్

నేడు శంబరపోలమాంబ ఐదో జాతర



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి ఐదో జాతర మంగళవారం జరగనుంది. ఈఓ వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలు ఏర్పాటు చేశారు. లడ్డూప్రసాదం, పులిహోరా ప్రసాదం తయారు చేయించారు. భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. సాలూరు సీఐ ధనంజయరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాల నుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, తదితరులు

పార్వతీపురం: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల నియమావళి అమలుపై దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలని, ఉల్లంఘనపై ఫిర్యాదువస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు పాల్గొన్నారు.

సత్తాచూపిన గిరిజన విద్యార్థి



విద్యార్థి రంజిత్‌ను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

కురుపాం: గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో కురుపాం మండలం ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నతపాఠశాల విద్యార్థి ఆరిక రంజిత్ సత్తాచూపాడు. జట్టును విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. విద్యార్థిని హెచ్‌ఎం కె.అక్కిన, వసతిగృహ సంక్షేమాధికారి ఎం.రాజేంద్రప్రాద్, పీడీలు ఎ.సన్యాసిరావు, పి.బోగేష్ సోమవారం అభినందించారు.

గిరిజన వర్సిటీకి 561.9 ఎకరాల భూమి సేకరణ

- ఇప్పటికే నష్టపరిహారం కింద రూ.5.25 కోట్ల చెల్లింపు
- ఆర్డీఓ పి.శేషశైలజ



బొబ్బిలి రూరల్: గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో 561.9 ఎకరాల భూ సేకరణ పూర్తయినట్టు ఆర్డీఓ పి.శేషశైలజ తెలిపారు. తన కార్యాల యంలో స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. వర్సిటీకి సేకరించిన భూములకు రూ.31.35కోట్లను పరిహారం చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ.5.25 కోట్లు చెల్లించినట్టు వెల్లడించారు. జిరాయితీ భూములకు ఎకరాకు రూ.9లక్షల నుంచి రూ.12లక్షలు, డీపట్టా భూములకు రూ.7.5లక్షలు, ఆక్రమణ భూములకు ఎకరాకు రూ.3.6లక్షల చొప్పున చెల్లిస్తున్నామన్నారు.

దుడ్డుఖల్లులో జోడో అభియాన్



చింతలపాడులో జోడో అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న సింహాచలం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో దుడ్డుఖల్లు, చింతలపాడు, దొరజమ్ము, కొత్తవలస గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం సోమవారం హాథ్‌సేహాథ్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధిహామీ పథకం వేతనదారుల వద్దకు వెళ్లి జోడోయాత్ర తీరును వివరించారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు మద్దతివ్వాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ నిమ్మక నీలావతి, వార్డు సభ్యుడు జి.నాగేశ్వరరావు, పి.పాపారావు తదితరులు ఉన్నారు.

తోటపల్లి పనులు చకచకా

- చురుగ్గా సాగుతున్న పాతఆయకట్టు ఆధునికీకరణ పనులు
- రూ.193కోట్లతో పాత, కుడి ఎడమ కాలువల అభివృద్ధి
- ఇప్పటివరకు రూ.43 కోట్ల ఖర్చు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఊపందుకున్న పనులు
- మొత్తం ఆయకట్టు: 63 వేల ఎకరాలు
- ఈ ఏడాది జూన్ చివరివారంలో సాగునీరందించేందుకు సన్నాహాలు



వీరఘట్టం మండలం కత్తులకవిటి-హుస్సేనుపురం మధ్యలో జరుగుతున్న ఎడమ కాలువ లైనింగ్ పనులు

వీరఘట్టం:

వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రాజెక్టుల ఆయకట్టు స్థిరీకరణతో పాటు అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించే పనులను చకచకా పూర్తిచేయిస్తోంది. కాలువలను ఆధునీకరిస్తోంది. రైతన్న సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. దీనికి తోటపల్లి ప్రాజెక్టు ఆయకట్టులో జోరుగా సాగుతున్న పనులే నిదర్శనం.

పనులు వేగవంతం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి ఆధునికీకరణ పనులపై దృష్టి సారించింది. రూ.139 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పనులు అంచనా వ్యయం గతేడాది రూ.193 కోట్లకు చేరడంతో రూ.163 కోట్లు సాంకేతిక అనుమతులతో మంజూరు చేసింది. ఇప్పటివరకు రూ.43కోట్ల విలువైన పనులు పూర్తికాగా బిల్లుల రూపంలో రూ.23 కోట్లను గతేడాది చెల్లించింది. మొత్తం 500కు పైగా పనులు పూర్తిచేయాల్సి ఉంది. కుడి, ఎడమ కాలువలు కలిపి మొత్తం 57 కి.మీ పొడవున విస్తరించి ఉండగా, ఇందులో దాదాపు 26కి.మీ వరకు పనులు పూర్తి చేశారు. కాలువ అడుగు భాగంలో 6 నుంచి 12 మీటర్లు వెడల్పున మట్టితో బైండింగ్ చేయడంతో పాటు అక్కడి నుంచి కాలువ గట్లను లైనింగ్ చేస్తున్నారు. కాలువలకు 200 చోట్ల చిన్న,పెద్ద వంతెనలు నిర్మించడంతో పాటు మరో 300 చోట్ల స్లూయిజ్‌లు, చప్టాలు, డ్రాఫ్ట్ వంతెనలు నిర్మించనున్నారు. ముందుగా లైనింగ్ పనులు పూర్తిచేసి ఆయకట్టు శివారు వరకు సాగునీరు సరఫరా అయ్యేలా పనులు సాగిస్తున్నారు. మొత్తం 63 వేల ఎకరాలకు కాలువల ద్వారా సాగునీరు అందనుంది. రానున్న ఖరీఫ్ నాటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మొత్తం ఆయకట్టుకు జూన్ చివరి వారంలో సాగునీరు అందించే లక్ష్యంతో పనులు ముమ్మరం చేశారు.

- ఎడమ కాలువలో ఇంత వరకు 14 కి.మీ పరిధిలో కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే 21-23 కి.మీ మధ్య ఎం.రాజపురం నుంచి హుస్సేనుపురం వరకు ఎర్త్, లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 23-37 కి.మీల మధ్యలో హుస్సేనుపురం నుంచి పాలకొండ మండలం వెలగవాడ వరకు ఎర్త్, లైనింగ్ పనులు ప్రారంభించారు.
- కుడి కాలువలో 12 కి.మీ కాంక్రీటు పనులు పూర్తి కాగా, 0-4, 16-20 వరకు లెవిలింగ్ పనులను ప్రస్తుతం చేస్తున్నారు. ఇలా ఇంత వరకు రూ.43 కోట్లు విలువ గల పనులు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నారు.

తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనుల వివరాలు

ఎడమ కాలువ పొడవు	: 37 కి.మీ.
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 16 కి.మీ.
కుడి కాలువ పొడవు	: 20 కి.మీ.
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 12 కి.మీ

ప్రస్తుతం చేపడుతున్న పనులు: పూడికలు తొలగించడం, లైనింగ్ చేయడం, వంతెనలు, స్లూయిజ్‌ల నిర్మాణం

ఆయకట్టు వివరాలు



ఎడమకాలువ పరిధిలోని మండలాలు: జియ్యమ్మవలస, గరుగుబిల్లి, వీరఘట్టం, పాలకొండ, బూర్జ ఆయకట్టు: 32 వేల ఎకరాలు

కుడికాలువ పరిధిలోని మండలాలు: గరుగుబిల్లి, బలిజిపేట, వంగర ఆయకట్టు: 7,543 ఎకరాలు

ఈ రెండు కాలువల పరిధిలో ఉన్న అదనపు ఆయకట్టు: సుమారు 23,457 ఎకరాలు

సకాలంలో నీరు విడుదల



ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది. పనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ చివరివారంలో కాలువలకు నీరు విడుదల చేసేందుకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం అందుతోంది. – దమలపాటి రవికుమార్, తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల డీఈఈ

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం

- డీఎంహెచ్ఓ జగన్నాథరావు



నడుకూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

వీరఘట్టం: రాష్ట్రంలో ప్రతీగడపకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం ఓ నూతన అధ్యాయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్నాథరావు తెలిపారు. వీరఘట్టం మండలం నడుకూరులో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ శిబిరం ద్వారా ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాల నిర్వహణ తేదీలను గ్రామీణ ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలతో పాటు 10-19 ఏళ్లలోపు బాలికల్లో రక్తహీనత నివారణకు కృషిచేయాలని సూచించారు. బీపీ, సుగర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ ఉమామహేశ్వరికి సూచించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి యోగేశ్వరరెడ్డి ఉన్నారు.

వేగవంతంగా గృహ నిర్మాణాలు



గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్

పాలకొండ: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, గృహనిర్మాణశాఖ డీఈ, ఏఈలతో పాటు ఇంజినీరింగ్ సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఉగాది నాటికి పూర్తి స్థాయిలో గృహ ప్రవేశాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపులో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి అవసరమైన సహకారం అందించాలని సూచించారు.

పంట నష్టాన్ని గుర్తించాలి



జిల్లా అటవీశాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం, భామిని మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు రైతులు సాగుచేసిన పంటలను ధ్వంసం చేస్తున్నాయని, పంటలను గుర్తించి పరిహారం అందేలా చూడాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అటవీశాఖ అధికారులను కోరారు. డీఎఫ్ఓ ప్రసూనకు ఫోన్‌లో రైతుల సమస్యను వివరించారు. చేతికందే సమయంలో చెరకు, మొక్కజొన్న, కూరగాయలు, అరటి తోటలను ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని వివరించారు. పంట నష్టం జరిగిన రైతుల వివరాలను వెంటనే ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. తను కూడా ఏనుగుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

గెలుపు బాధ్యత మనదే..



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: వచ్చే నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజుసుధాకర్‌కు ఒకటవ ప్రాధాన్య ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించి, విశాఖపట్నం రాజధాని కాంక్షను చాటిచెప్పాలని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. పట్టణంలో తన గృహంలో సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రాజధాని అయితే ఉత్తరాంధ్రలో ఉపాధి కల్పన పెరిగి ఉద్యోగాలు అధికంగా వస్తాయన్నారు. పిల్లల భవిష్యత్‌కు భరోసా దొరుకుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా అన్ని రంగాల్లో ముఖ్యమంత్రి ఆదర్శవంతమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్నారన్నారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేస్తున్న దేశంలోనే ఏకైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు మోసపూరిత పాలనను రైతులు, నిరుద్యోగులు, డ్వాక్రా మహిళలు మరచిపోలేదన్నారు. మరోసారి అబద్ధపు మాటలు చెప్పినా వినేవారు లేరన్నారు. సీఎం పాలనను బలపర్చేందుకు, విశాఖరాజధాని సాధనకు మద్దతు తెలిపేందుకు ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజుసుధాకర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

తక్షణమే పూరిళ్లను ఖాళీ చేయండి

- ఇక్కడ నివసించేవారందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తాం
- పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలి
- 'సాక్షి' కథనంతో స్పందించిన యంత్రాంగం
- తెట్టంగి పాఠశాల స్థల ఆక్రమణదారులతో మాట్లాడిన తహసీల్దార్



తెట్టంగి హైస్కూల్ మైదానం ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

సాక్షి ఎఫెక్ట్

వీరఘట్టం: దశాబ్దాల కాలంగా వీరఘట్టం మండలం తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఆక్రమణలకు గురైంది. దీంతో పాఠశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. విద్యార్థుల క్రీడల నిర్వహణకు ఆటంకం కలుగుతోంది. నిత్యం ఆక్రమణదారులు అలజడి చేస్తుండడంతో విద్యాబోధన సరిగా సాగడం లేదు. విద్యా ప్రమాణాలు రోజురోజుకు కుంటుపడుతున్నాయి. ఇదే విషయాన్ని ఈ 7న 'సాక్షి'లో 'ఆక్రమణ వలయంలో చదువుల నిలయం' శీర్షికన ప్రచురితమైన కథనంపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. కలెక్టర్ నిషాంత్‌కుమా ర్ ఆదేశాల మేరకు వీరఘట్టం తహసీల్దార్ చందక సత్యనారాయణ తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణాన్ని సోమవారం పరిశీలించారు. పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ, హద్దులు, మధ్యలో ఉన్న పూరిళ్లను పరిశీలించారు. పూరిళ్లలో ఉన్నవారితో మాట్లాడారు. ఆక్రమణలు తొలగించి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇక్కడ పూరిపాకలు వేసిన వారందరికీ ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పారు.

పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వండి

పూరిపాకలను ఖాళీచేస్తే వేరేచోట ఇళ్ల స్థలాలు ఇస్తామంటున్నారు. అయితే మా అందరికీ పట్టా ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఆక్రమణదారులందరూ తహసీల్దార్‌ను కోరారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఇళ్ల స్థలాలతో పాటు ప్రతీఒక్కరికి రూ. 1.80 లక్షలు చొప్పున ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని, మరో 35వేల వరకు రుణం మంజూరు చేస్తుందని, ఆ డబ్బులతో ఇళ్లు కట్టుకోవాలని సూచించారు.

పెనుమత్సకు పెద్దపీట

- 'అన్న'మాట ప్రకారం ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటన
- మరోసారి శాసన మండలి సభ్యుడిగా సురేష్‌బాబుకు అవకాశం
- వైఎస్సార్‌సీపీ అధిష్టానం నిర్ణయం
- గెలుపు లాంఛనమే..
- సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న 'సాంబశివరాజు' కుటుంబానికి దక్కిన గౌరవం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సురేష్‌బాబు, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సుదీర్ఘ రాజకీయ అనుభవం, ఎనిమిది పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన దివంగత నేత పెనుమత్స సాంబశివరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అరుదైన గౌరవం ఇచ్చి హామీని నిలబెట్టుకొన్నారు. సాంబశివరాజు కుమారుడు డాక్టర్ పెనుమత్సవరాహ వెంకట సూర్యనారాయణరాజు(సురేష్ బాబు)కు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆయన పేరును ఖరారుచేస్తూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం సోమవారం ప్రకటన జారీచేసింది. దీంతో తొలిదఫా రెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్న సురేష్ బాబు ఈ సారి ఆరేళ్ల పాటు కొనసాగనున్నారు. పెద్దాయన సాంబశివరాజు కుటుంబానికి తగిన గౌరవం ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈ సారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని జిల్లా ప్రజలు కొనియాడుతున్నారు. త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సురేష్‌బాబు గెలుపు ఇక లాంఛనమే.

ఎంపీటీసీ నుంచి ఎమ్మెల్సీగా...

నెల్లిమర్ల మండలం మొయిద విజయరాంపురం గ్రామానికి చెందిన డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు ఎంపీటీసీ సభ్యుడి స్థాయి నుంచి ఎమ్మెల్సీగా ఎదిగారు. నెల్లిమర్ల మండల ఎంపీటీసీ సభ్యుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. బీడీఎస్ చదివిన ఆయన కొన్నేళ్ల పాటు దంత వైద్యుడిగా జిల్లా ప్రజలకు సేవలందించారు. కొన్నేళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డెంటల్ కౌన్సిల్ మెంబరుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి, 6 వేల ఓట్ల 4స్వల్ప తేడాతో ఓడిపోయారు. నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనరుగా, రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. 2020 ఆగస్టు 17వ తేదీ నుంచి శాసనమండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గానికి పార్టీ పరిశీలకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సీఎంను కలిసిన పెనుమత్స

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో తాడేపల్లిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, విజయవాడలో మంత్రి బొత్స సత్యనారాయణను పెనుమత్స సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు.

అభినందనల జల్లు

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా సురేష్‌బాబును వైఎస్సార్‌సీపీ అధిష్టానం ప్రకటించడంతో ఆయనపై అభినందనల జల్లు కురుస్తోంది. సౌమ్యుడిగా, విద్యావంతుడిగా పేరున్న సురేష్ బాబుకు అరుదైన గౌరవం దక్కిందని జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. పార్టీ అధిష్టానం సరైన నిర్ణయం తీసుకుందని కొనియాడుతున్నారు.

సురేష్‌బాబు బయోడేటా

పేరు: పెనుమత్స వరాహ వెంకట సూర్యనారాయణరాజు
తండ్రి పేరు: పెనుమత్స సాంబశివరాజు
తల్లి పేరు: పెనుమత్స వెంకటరమణమ్మ
భార్య పేరు: పెనుమత్స రోజారాణి
పిల్లలు: ఇద్దరు. అఖిల్ వర్మ, అజిత్ వర్మ
పుట్టినతేది: జూలై 6, 1966
విద్యార్హతలు: బీడీఎస్
పూర్వ వృత్తి: దంతవైద్యులు
స్వగ్రామం: నెల్లిమర్ల మండలంలోని మొయిద విజయరాంపురం

నిబద్ధతకు గుర్తింపు

పాలకొండ: పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు లభిస్తుందని మరో మారు సీఎం జగన్‌మోహనరెడ్డి రుజువుచేశారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి, సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ పాతపట్నం నియోజకవర్గం పరిశీలకుడిగా విశేషసేవలు అందిస్తున్న పెనుమత్సకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి బొత్స సత్యనారాయణను కలిసిన సురేష్‌బాబు

క్లుప్తంగా

పోక్సో కేసుపై డీఎస్పీ దర్యాప్తు



తమ్మయ్యవలసలో దర్యాప్తు చేస్తున్న డీఎస్పీ మోహన్‌రావు

తెర్లాం: బొబ్బిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసుకు సంబంధించి తెర్లాం మండలం తమ్మయ్యవలస గ్రామంలో సోమవారం బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు సోమవారం దర్యాప్తు నిర్వహించారు. బొబ్బిలిలో నివాసముంటున్న తమ్మయ్యవలసకు చెందిన ఓ యువతి తనకు జరిగిన అన్యాయంపై బొబ్బిలి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయగా డీఎస్పీ దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం గ్రామానికి వచ్చి నేరస్థలాన్ని పరిశీలించడంతో పాటు సాక్షులను విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తామని చెప్పారు. ఆయనతోపాటు బొబ్బిలి టౌన్ ఎస్సై సత్యనారాయణ, తెర్లాం ఎస్సై ఆర్.రమేష్, సిబ్బంది ఉన్నారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



విరోతి దేముడు (ఫైల్)

కొత్తవలస రూరల్: మండలంలోని దేశపాత్రునిపాలెం వద్ద సోమవారం జరిగిన రైలు ప్రమాదంలో విరోతి దేముడు (75) అనే వృద్ధుడు మృతి చెందాడు. దేముడు తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పుణ్యగిరి జాతర ప్రశాంతం

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా వాసికెక్కిన పుణ్యగిరిలో శివరాత్రి సందర్భంగా రెండు రోజులు పాటు నిర్వహించిన జాతర ప్రశాంతంగా ముగిసింది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే అద్భుతం శనిత్రయోదశి వేళ మహాశివరాత్రి, మాసశివరాత్రి కలిసి వచ్చాయి. దీంతో పుణ్యగిరికి భక్తజనం పోటెత్తుతారని అధికార యంత్రాంగం ఆశించినప్పటికీ గత ఏడాది కన్నా ఈ ఏడాది భక్తుల రాక తగ్గింది. భక్తుల తాకిడి తగ్గడానికి కారణం సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు సరైన సౌకర్యాలు, వసతులు లేకపోవడమే కారణమని పలువురు చెబుతున్నారు.దేవాదాయశాఖ గణాంకాల ప్రకారం గత ఏడాది 35వేల మంది పుణ్యగిరిని సందర్శిస్తే ఈ ఏడాది 25వేల మంది మాత్రమే వచ్చారు. మొత్తంగా భక్తల రాక తగ్గడంతో ఆర్టీసీ ఆదాయం తగ్గింది. భక్తుల కోసం రెండు రోజుల పాటు నిరంతరాయంగా ఆర్టీసీ సరీ్వసులు నిర్వహించింది. పోలీస్‌శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయగా, వైద్యారోగ్యశాఖ ఉచిత వైద్య శిబిరాలు, పంచాయతీరాజ్ ఉద్యోగులు చలివేంద్రాలు, మరుగుదొడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాయి. దేవాదాయశాఖ భక్తులకు దర్శనాలు కల్పించి, ప్రసాదాలు ఏర్పాటు చేసింది. మొత్తంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, అపశృతులు దొర్లకుండా జాతర ముగియడంతో ఆయా శాఖల అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు భారతి



ఖోఖో పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం ఆదిలక్ష్మి



జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన భారతి

గంట్యాడ: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థిని పాటుపురెడ్డి భారతి ఎంపికైంది. విశాఖపట్నం జిల్లా భీమిలిలో అండర్-14 విభాగంలో ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 17 నుంచి 19 వతేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన భారతి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే బాలుర ఖోఖో జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా భారతిని, జిల్లా జట్టులో పాల్గొన్న పాఠశాల విద్యార్థులను హెచ్ఎం ఆదిలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్సీ కేటాయింపులపై హర్షం

విజయనగరం అర్బన్: ఎమ్మెల్సీ పదవులను బీసీలకు అధిక సంఖ్యలో కేటాయించడం హర్షణీయమని పరిపాలనా వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. త్వరలో ఖాళీ అవుతున్న 18 ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ప్రతిపాదిస్తూ వైఎస్సార్‌సీపీ సోమవారం ప్రకటన విడుదల చేసింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, 18 ఎమ్మెల్సీ సీట్లలో బీసీలకు అత్యధికంగా 11 కేటాయించడం గొప్ప విషయమన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడ్డారు.

స్పందనకు 85 దరఖాస్తులు



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకట్రావులు ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఎస్ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఈఓ ఎస్‌డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలలో కొన్ని...

గుమ్మలక్ష్మీపురం మండలం మంత్రజోల గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని గ్రామానికి చెందిన పి.కామేశ్వరరావు తదితరులు అర్జీ అందజేశారు.

- బలిజిపేట మండలం వెంగళరాయపురం గ్రామంలో సాగు చేసిన భూమికి అధికారులు డీపట్టా ఇచ్చారని, ఇనాం భూములు అయినందున రైతువారీ పట్టా మంజూరు చేయాలని గ్రామానికి చెందిన బి. సన్యాసి తదితరులు అర్జీ ఇచ్చారు.
- గరుగుబిల్లి మండలం గొట్టివలస రెవెన్యూ పరిధిలో ఉన్న కొండపై జీడి, టేకు మొక్కలను సాగు చేశాం. కొండపై సాగుచేసిన రైతులకు 8వ విడతలో పట్టాలు మంజూరు చేస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆ కొండకు రెవెన్యూ అధికారులు కొలతలు వేసి అది ప్రభుత్వ స్థలమని చెబుతున్నారు. సాగు చేస్తున్న కొండకు డీపట్టాలు ఇప్పించి ఆదుకోవాలని గొట్టివలసకు చెందిన పి.సూర్యనారాయణ తదితరులు కోరారు.
- మక్కువ మండలం బట్టివలస గ్రామానికి చెందిన వి.వెంకట్రావుతోపాటు పలువురు రైతులు వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

పార్వతీపురం టౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించే చర్యలు చేపట్టి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన వారంరోజుల్లోగా సమస్య పరిష్కరించి, జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ ఎస్బీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- 'జగనన్నకి చెబుదాం'కు 112 వినతులు



వినతులను వింటున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరమే స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఆమె ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 'జగనన్నకి చెబుదాం (స్పందన)' కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి 112 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 78 అర్జీలు వచ్చాయి. డీపీఓకు 10, డీఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖలకు చెరో ఏడేసి వినతులు రాగా ఈపీడీసీఎల్‌కు 5, మున్సిపాలిటీకి 3, డీఎంహెచ్‌వోకు, సచివాలయ విభాగానికి చెరొకటి వచ్చాయి. కలెక్టర్‌తోపాటు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉపకలెక్టర్లు సుదర్శన దొర, సూర్యనారాయణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుదారులకు సత్వరన్యాయం



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమం దించేందుకు కృషిచేస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో బాధితుల నుంచి 24 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయమందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ జి.రాంబాబు, ఎస్సైలు వాసుదేవ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణులదే

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సీతం రాజు సుధాకర్‌ను గెలిపించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన వివిధ జోనల్ కార్యాలయాలలో పార్టీ శ్రేణులతో ప్రత్యేక సమావేశమయ్యారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్పొరేటర్లను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సిద్ధాంతాలను, జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు గృహసారథులను, సచివాలయ కన్వీనర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న శాసనమండలి ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటర్లను గుర్తించి అభ్యర్థుల విజయానికి వారిలో అవగాహన కల్పించాలని కోరారు. పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలో అభ్యర్థి గెలుపు కోసం పార్టీ ప్రతిష్టాత్మకంగా స్వీకరించిందన్నారు. అందువల్ల గెలుపు బాధ్యతను పార్టీ శ్రేణులపై ఉంచిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 2024లో వైఎస్సార్‌సీపీ గెలవడం చారిత్రక అవసరమన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి పదవి చేపట్టి రాష్ట్ర భవిష్యత్తును ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తమన్న శెట్టి, డా.వీఎస్ ప్రసాద్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

2024 నాటికి గ్రీన్‌ఫీల్డ్ పూర్తి

- ఆర్డీఓ శైలజ



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శైలజ

మెంటాడ: విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ వరకూ నిర్మాణం జరుపుకుంటున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి 2024 నాటికి పూర్తయ్యేందుకు కృషి చేస్తున్నామని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె రహదారి పనులను మెంటాడలో పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆరులైన్ల రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. అలాగే మండల కేంద్రంలో రింగ్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణతో పాటు నిర్వాసితులకు పరిహారం అందేలా దృష్టి సారిస్తున్నామని చెప్పారు. స్థానిక రైతులు ఆమెతో ఈ సందర్భంగా మాట్లాడుతూ హైవేకు అవతలి వైపున పొలాలు ఉన్న రైతులకు పంటను గ్రామంలోకి తరలించేందుకు రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగనీయకుండా హైవే కింద భాగంలో రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే స్థానిక గ్రామ పెద్దలు సిరిశెట్టి నారాయణరావు, గండ్రేటి అప్పలనాయుడు, రాజగోపాల్, రవి తదితరులు హైవే నిర్మాణానికి పరిమితికి మించి మెంటాడ కొండ నుంచి గ్రావెల్‌ను తోడేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ పంచాయతీకి ఎటువంటి రుసుం చెల్లించకుండా గ్రావెల్‌ను రవాణా చేయడంపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికుల ఫిర్యాదులు విన్న ఆర్డీఓ మాట్లాడుతూ హైవే సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షణలో తహసీల్దార్ ఆదిబాబు, స్థానిక సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా

విజయనగరం క్రైమ్: నిషేధిత వస్తువుల అక్రమ రవాణా కట్టడికి నిఘా పెట్టామని విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అఖిలేష్‌కుమార్, ఎస్సై రవివర్మ, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా వంటి నిషేధిత వస్తువుల రవాణాపై పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ చేస్తోందన్నారు. అనుమానాస్పదంగా కనపడిన వస్తువులు, బ్యాగ్‌లను తనిఖీలు చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ తాలాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, భాస్కర్ (వెనుక ముసుగులో నిందితులు)



పార్వతీపురం టౌన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై ఫక్రుద్దీన్

విజయనగరం క్రైమ్: విధులు నిర్వహించుకుని ఇంటికి వెళ్తున్న వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సైలు అశోక్‌కుమార్, భాస్కరరావులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విధులు పూర్తిచేసుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పీవీఆర్ ఆస్పత్రి రోడ్డులో వెళ్తున్న దిలీప్ కుమార్‌పై ఈ నెల 17న రాత్రి 11.30 గంటల సమయంలో గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు దాడి చేసి అతని వద్ద ఉన్న పర్స్, డబ్బులు సెల్‌ఫోన్ లాక్కున్నారు. అది గమనించిన వెంకట్రావు అనే వ్యక్తి వారి నుంచి దిలీప్‌ను కాపాడేందుకు ప్రయతి్నస్తే అతన్ని కూడా కొట్టి సెల్, డబ్బులు పట్టుకుని పరారయ్యారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు నిందితులు అల్లు సాగర్, చండీభానుకిశోర్‌లను అరెస్టు చేసి, వారి నుంచి పర్స్, సెల్‌ఫోన్, నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఇద్దరు నిందితులను ఇప్పటికే గంజాయి కేసులో రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులోఇద్దరు..

పార్వతీపురంటౌన్: గత సంవత్సరం అక్టోబర్ నెల 18న పార్వతీపురం పట్టణంలోని సారిక వీధిలో జరిగిన దొంగతనం కేసులో సోమవారం ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్సై ఫకృద్దీన్ తెలిపారు. ఆయన తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఇందిరా కాలనీ వాసులు సొండి శ్రీధర్, స్నేహితుడు దేవుపల్లి నవీన్ మరో వ్యక్తి కలిసి అక్టోబర్ 10వ తేది రాత్రి వారాల పండగ పూర్తయిన తరువాత షేక్ రఫీ అనే వ్యక్తి ఇంటికి సరిగా తాళాలు వేయకుండా నిద్రిస్తున్న విషయం గమనించి ఇంట్లో చొరబడి, బంగారు వస్తువులు, డబ్బు ఒక సెల్‌ఫోన్ దోచుకుని పరారయ్యారు. సీసీఎస్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం ఆధారంగా, టౌన్ పోలీసులు నిందితులిద్దరినీ అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తు రెండు బంగారు ఉంగరాలు, చెవి దుద్దులు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మూడవ వ్యక్తిని, మరికొంత చోరీ సొత్తు గురించి పోలీసులు గాలిస్తున్నారు.

డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్



మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పొజు మధుసూధనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్ కోలా వెంకట హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు మొత్తం 11 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ డబ్బు కోసమే మధుసూధనరావును కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి రూ.11.75 లక్షలు తీసుకోగా... కిడ్నాపర్లలో ఒకరికి డబ్బులు ఇస్తానని చెప్పి, అతడి సహకారంతో కిడ్నాపర్ల చెర నుంచి మధుసూధనరావు తప్పించుకొని ఈ నెల 17వ తేదీన పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు వివరించారు.

ప్రత్యేక బృందాల దర్యాప్తుతో 11 మంది అరెస్ట్

మధుసూధనరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ - 1 సుమిత్ సునీల్ గరుడ కేసును స్వయంగా పర్యవేక్షించారు. 10 బృందాలను ఏర్పాటు చేసి కిడ్నాపర్ల కోసం గాలించారు. మధుసూధనరావు బ్యాంక్ ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాల వివరాలు, ఇతర సాంకేతికతతో కిడ్నాపర్లను పోలీసులు గుర్తించారు. అసలు కిడ్నాపర్ హేమంత్‌కుమార్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి గోవాకు పారిపోయాడు. పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా హేమంత్‌కుమార్‌తోపాటు మొత్తం 11 మంది కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో కోలా హేమంత్‌కుమార్, ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్నా(19), కేడీ పేటకు చెందిన సుర్ల నాగ గణేష్(21), దొండపర్తికి చెందిన దమ్ము శరత్‌తేజ(21), దమ్ము సాగర్ శ్రీనివాస్(22), మన్యం జిల్లాకు చెందిన జెర్రెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన బింపోలు రాంబాబు, వడ్లపూడికి చెందిన గంధవరపు తరుణ్‌కుమార్(32), అనకాపల్లికి చెందిన బలిరెడ్డి నానాజీ(25)లను సోమవారం అరెస్ట్ చేశారు. గంధవరపు తరుణ్‌కుమార్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రెండు జతల పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. హేమంత్ కుమార్‌పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీకాంత్ చెప్పారు. అలాగే కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, రాంబాబుపై కూడా రెండేసి కేసులు ఉన్నట్లు వివరించారు.

ఆర్థిక ప్రణాళిక రూపకల్పనకు గణాంకాలే కీలకం



సత్కారం పొందుతున్న కేంద్ర సాంఖ్యాక శాస్త్ర విభాగ అడిషినల్ డైరెక్టర్ జనరల్ జీఎస్‌లక్ష్మి

విజయనగరం అర్బన్: సామాజిక, ఆర్థిక ప్రణాళిక విధాన రూపకల్పలో గణాంకాల పాత్ర కీలకంగా నిలుస్తుందని కేంద్ర సాంఖ్యాక శాస్త్ర విభాగ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జీఎస్.లక్ష్మి అన్నారు. స్థానిక మహరాజా అటానమస్ కళాశాలలో 'అధికారిక గణాంకాలు (అఫిషియల్ స్టేటిస్టిక్స్) అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ అభివృద్ధిలో అధికారిక గణాంకాల ప్రాముఖ్యతను తెలుసుకోవడానికి ఇలాంటి సదస్సులు నిర్వహించాలని సూచించారు. అవగాహన పెంచడానికి సంబంధిత అంశంపై పోటీలు, చర్చలు విద్యాలయాల్లో నిర్వహించాలన్నారు. జాతీయ గణాంక కార్యాలయాల సేవలను ఉపయోగించుకుని సమాచారాన్ని వినియోగదారులు సేకరించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేల నగదును విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరు కేటగిరిలుగా అందజేశారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు, సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి ఎంవీలక్ష్మి, అధ్యాపకులు నరేష్, ఎస్.నవీన్‌కుమార్, డాక్టర్ పీ.గణపతిరావు, డాక్టర్ ఎం.రత్నరాజు, ఎల్.దేవి, ఎన్ఎస్ఎస్ జిల్లా పీఓ జి.చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌బీ శాతం తెలుసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) శాతాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలో గర్భిణులకు జరుగుతున్న హెచ్‌బీ పరీక్షలు పరిశీలించడానికి వచ్చిన స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ, గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేయడానికి ఏఎన్ఎంలకు ఇటీవల మిషన్లు ఇచ్చారని తెలిపారు. వాటితో చేసిన పరీక్షకు, సాధారణ పద్ధతిలో ల్యాబ్ టెక్నీషియన్ చేసిన పరీక్షకు తేడాలున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలనలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ జగదీష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹107	₹184	₹ 194